క్లుప్తంగా

18న వైద్యపరీక్షలు

భానుపురి : సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ఎస్వీఆర్ హాస్పిటల్‌లో తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట సభ్యులకు గుండె వైద్య నిపుణులతో ఉచిత ఓపీతో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్ రెడ్డి, సుధగాని నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ పరీక్షలు ఉంటాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా



బొల్లంపల్లిలో ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

అర్వపల్లి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, హరితహారం, సీజనల్ వ్యాధులపై తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో శనివారం బొల్లంపల్లిలో ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల సహకార సంఘం చైర్మన్ కేసాని అరుణరామనర్సయ్య, కళాకారులు వెన్నెల నాగరాజు, గడ్డం ఉదయ్, పాలకుర్తి శ్రీకాంత్, పాక ఉపేందర్, పల్లెల రాము, లక్ష్మణ్, మంజుల, నాగలక్ష్మి, శిరీష, ప్రియాంక, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీపీకి పరామర్శ



ఎంపీపీ నెమ్మాది భిక్షంను పరామర్శిస్తున్న అసెంబ్లీ చీఫ్ మార్షల్ తౌగరు కరుణాకర్

పెన్‌పహాడ్ : ఎంపీపీ నెమ్మాది భిక్షం కాలుకు ఇటీవల శస్త్ర చికిత్స కావడంతో ఆదివారం తెలంగాణ అసెంబ్లీ చీఫ్ మార్షల్ తౌగరు కరుణాకర్ అతడిని పరామర్శించారు. అదే విధంగా తిప్పర్తి ఎస్ఐ నకిరేకంటి ధర్మా కూడా ఎంపీపీని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యూషన్ సెంటర్

మద్దిరాల : అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాస వెంకటరెడ్డి జ్ఞాపకార్థం యాస శృతి సౌజన్యంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచిత ట్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం చందుపట్ల గ్రామంలో ఈ ట్యూషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్ కస్తూరి రాణి శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం యాస మల్లారెడ్డి, వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దండ శంకర్‌రెడ్డి, చొల్లేటి ఉపేంద్రచారి పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరిగి చెత్త సేకరణ



ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరిస్తున్న సర్పంచ్ ఎన్.శాతవాహనరావు, వార్డు సభ్యులు

తిరుమలగిరి : మండల పరిధిలోని తొండ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో పాల్గొంటుండటంతో ఆదివారం ఆ గ్రామ సర్పంచ్ ఎన్.శాతవాహనరావు ఆధ్వర్యంలో ట్రాక్టర్ల ద్వారా ఇంటింటికీ తిరిగి చెత్త సేకరణ చేశారు. సర్పంచ్ స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ వీధులన్నీ తిరిగారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకన్న, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రుణమాఫీ అమలు చేయాలి

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.లక్ష రుణమాఫీ అమలు చేయాలని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఈ సమావేశంలో పచ్చిపాల వెంకన్న, బర్పటి ఉపేందర్, తాళ్ల సురేష్, పాక అమృతమల్లు, రేసు లింగయ్య, మామునూరి ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం

మద్దిరాల : ఇటీవల మద్దిరాల నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ రవీందర్‌ను బీజేవైఎం నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు బొమ్మెర నరేష్, నాయకులు యాటకారి మహేష్, దళపతి, గంగాధర్, ప్రశాంత్, మనోజ్ పాల్గొన్నారు.



ఎస్ఐని సన్మానిస్తున్న బీజేవైఎం నాయకులు

రెండోవిడత గొర్రెల పంపిణీ ఎప్పుడో..

- తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి పరిధిలో ప్రారంభం
- మిగిలిన చోట్ల జాడలేని పంపిణీ ప్రక్రియ

అర్వపల్లి : రెండోవిడత గొర్రెల పంపిణీ తుంగతుర్తి నియోజకవర్గంలో లాంఛనంగా ప్రారంభానికే పరిమితమైంది. ఇటీవల తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తిరుమలగిరి మండలంలో రెండోవిడత గొర్రెల పంపిణీని ప్రారంభించారు. మిగిలిన మండలాల్లో పంపిణీ కార్యక్రమాన్ని మొదలు పెట్టాల్సి ఉంది. అన్ని గ్రామాల్లో లబ్ధిదారులు యూనిట్ల కోసం డీడీలు కట్టి ఉన్నారు. గొర్రెలు ఎప్పుడొస్తాయోనని ఎదురుచూస్తున్నారు.



జాజిరెడ్డిగూడెం మండలంలో ఇలా..

జాజిరెడ్డిగూడెం మండలంలో గొర్రెల యూనిట్ల పంపిణీకి సంబంధించి మొదటి విడతలో 984 యూనిట్లను పంపిణీ చేశారు. రెండోవిడతకు సంబంధించి 1,004 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేయాలని పశుసంవర్థక శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఈ విడతలో ఇప్పటికే లబ్ధిదారులు తమ వాటా కింద రూ.43,750 చొప్పున 295 మంది ప్రభుత్వానికి డీడీలు చెల్లించారు. ఈ విడతలో మొదట జాజిరెడ్డిగూడెం, కాసర్లపహాడ్ గ్రామాలను అధికారులు ఎంపిక చేశారు. జాజిరెడ్డిగూడెంలో 198, కాసర్లపహాడ్‌లో 97 యూనిట్లను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ విడతలో ప్రభుత్వం ఒక్కో యూనిట్ కింద 20 గొర్రెలు, ఒక గొర్రె పొట్టేలు ఇవ్వనుంది. లబ్ధిదారుడు తమ వాటాధనం కింద రూ. 43,750 చెల్లిస్తుండగా ప్రభుత్వం యూనిట్‌కు రూ.1,75,000 విలువ చేసే గొర్రెలను అందిస్తుంది. తాము అప్పులు చేసి డీడీలు చెల్లించామని.. వెంటనే రెండో విడత యూనిట్లను పంపిణీ చేయాలని గొర్రెల కాపరులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రెండో విడత పంపిణీ చేయాలి



రెండో విడత గొర్రెల పంపిణీకి సంబంధించి లబ్ధిదారులు డీడీలు కట్టారు. గొర్రెలను ఎప్పుడు పంపిణీ చేస్తారో అని ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నియోజకవర్గానికి ఒక్క గ్రామంలో మాత్రమే గొర్రెలను పంపిణీ చేసింది. అన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు గొర్రెలను వెంటనే పంపిణీ చేయాలి.

- వజ్జె వినయ్, గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి



రెండోవిడత గొర్రెల పంపిణీని దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలంలో ప్రారంభించడం జరిగింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అన్ని గ్రామాల్లో పంపిణీ ప్రారంభం కానుంది. రెండో విడతలో మండలంలోని జాజిరెడ్డిగూడెం, కాసర్లపహాడ్ గ్రామాలను ఎంపిక చేశాం. ఈ రెండు గ్రామాల్లో 295 మంది లబ్ధిదారులు డీడీలు చెల్లించారు.

- బి.అర్జున్, మండల పశువైద్యాధికారి

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

తుంగతుర్తి : మానవ మనుగడకు మొక్కలే జీవనాధారని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత చేపట్టాలని తెలంగాణ సంస్కృతిక సారథి జిల్లా కోఆర్డినేటర్ వేముల నరేష్ అన్నారు. ఆదివారం మానాపురంలో హరితహారంపై తెలంగాణ సంస్కృతిక సారథి బృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. మొక్కల పెంపకం ద్వారానే కరువు, కాటకాలను పారదోలవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి సభ్యులు గంట భిక్షపతి, మాగి శంకర్, వేముల శ్రవణ్, ఈర్ల సాయి, పల్స నిర్మల, సిరిపంగి రాధ, నెమ్మాది స్రవంతి, ఇందిరా ప్రియదర్శిని, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తి : మానాపురంలో హరితహారంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అన్ని రంగాల్లో భాగస్వామ్యం హర్షణీయం



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హైమావతి, కౌన్సిలర్ పావని, తదితరులు

భానుపురి : మహిళలు ఇంటికే పరిమితం కాకుండా రాజకీయ, సేవా రంగాల్లో భాగస్వామ్యం కావడం హర్షణీయమని లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి అధ్యక్షురాలు వీరవోలు హైమావతి, కౌన్సిలర్ గండూరి పావని అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 45వ వార్డులో లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి, కౌన్సిలర్ పావని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి రీజియన్ చైర్మన్ గండూరి కృపాకర్, జోన్ చైర్మన్ ఆదుర్తి రమేష్ చంద్ర, లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి సెక్రటరీ వెన్న కవిత, విజయలక్ష్మి, ఇరిగి కోటేశ్వరి, దూలం నగేష్, వెంకటలక్ష్మి, విజయ, పద్మ, ఆండాలు, నామా వేణు, కళ్యాణ్, కుక్కడపు భిక్షం, సాలయ్య, సందీప్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ, ఏడీలను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

తిరుమలగిరి : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలని ఫిర్యాదు చేసినా పాఠశాలను సీజ్ చేయని డీఈఓ, ఏడీలను సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలకు జిల్లా విద్యాధికారి కొమ్ము కాస్తున్నారని అన్నారు. ఆయా విద్యా సంస్థల్లో జరుగుతున్న అక్రమాలను విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వెలుగులోకి తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రైవేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ యథేచ్ఛగా ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్, నసీరుద్దీన్, మహేష్, నవీన్ పాల్గొన్నారు.

ఇష్టాగోష్ఠితో స్నేహపూర్వక వాతావరణం

చివ్వెంల : ఇష్టాగోష్ఠి కార్యక్రమం వల్ల నాయకులు, కార్యకర్తల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం దురాజ్‌పల్లి గ్రామ శివారులోని మున్నూరుకాపు భవన ప్రాంగణంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇష్టాగోష్ఠి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో వ్యక్తిగత, రాజకీయ విషయాలు మాట్లాడుతూ భోజనం చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర, తుక్కాని మన్మథరెడ్డి, ఎండీ అబీబ్, పగిళ్ల సుసిందర్ రెడ్డి, పల్స మల్సూర్ గౌడ్, అయితగాని జానయ్య, అరూరి శివ, పోలగాని ధనుంజయ్ గౌడ్, శ్రీనివాస్, వాజిద్ మియా, రాములు, ప్రసాద్, వల్లపట్ల మహేష్, రామారావు పాల్గొన్నారు.



ఇష్టాగోష్ఠి కార్యక్రమంలో పాల్గొన్న సంకినేని

నాగరిక సమాజానికి విద్యే గీటురాయి



అనాజిపురంలో కందుకూరి లక్ష్మమ్మ-పుల్లారెడ్డి విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి



సూర్యాపేట టౌన్ : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి జగదీష్‌రెడ్డి

పెన్‌పహాడ్ : నాగరిక సమాజానికి విద్యనే గీటురాయి అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. అనాజిపురంలోని కందుకూరి లక్ష్మమ్మ-పుల్లారెడ్డి మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కందుకూరి లక్ష్మమ్మ-పుల్లారెడ్డి జ్ఞాపకార్థం డాక్టర్ మల్గిరెడ్డి అర్జున్‌రెడ్డి-సుధా, కందుకూరి ప్రతాప్‌రెడ్డి-నిర్మల దంపతులు రూ. 4లక్షల వ్యయంతో నిర్మించిన కళావేదికను ఆయన ప్రారంభించారు. అలాగే పాఠశాల స్థల దాతలు దివంగత కందుకూరి లక్ష్మమ్మ-పుల్లారెడ్డి దంపతుల విగ్రహాలను ఆయన విష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను, పుట్టిన నేల మూలాలను మర్చిపోకుండా అభివృద్ధి కోసం దాతలు ముందుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం 2021-22 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు యు.శ్రీవేణి, బి.విజ్ఞేష్‌కి గోల్డ్‌మెడల్‌తో పాటు రూ.10వేల పారితోషికం, మెరిట్ సర్టిఫికెట్‌లు అందజేశారు. అదే విధంగా తెలుగు సబ్జెక్టులో ఉత్తమ ఫలితాలు సాధించిన విజ్ఞేష్‌కు కందుకూరి ప్రతాప్‌రెడ్డి తన గురువు బైరెడ్డి మట్టారెడ్డి పేరు మీద అవార్డు అందజేయడంతో పాటు రూ.10వేలు, మెరిట్ సర్టిఫికెట్ అందజేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన దాత కందుకూరి జనార్దన్‌రెడ్డి సుమారు రూ. 20వేలు విలువ చేసే గ్యాస్ పొయ్యిలతో పాటు సిలిండర్లను అందజేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సభ్యుడు ఒంటిద్దు నర్సింహారెడ్డి, హెచ్ఎం యుగేందర్, సర్పంచ్ చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ రాయన్న, రవీందర్‌రెడ్డి, బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జి. వెంకటేశ్వర్లు, లక్కపాక నర్సయ్య పాల్గొన్నారు.

జీజేఆర్ కప్ క్రీడా పోటీలు ప్రారంభం

సూర్యాపేటటౌన్ : క్రీడలు మానసిక రుగ్మతలను రూపుమాపుతాయని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జీజేఆర్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే గ్రామీణ స్థాయి మొదలు నియోజకవర్గ స్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ క్రీడాకారుల కోసం ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సోమా భరత్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మంత్రి తనయుడు వేమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె



తిరుమలగిరిలో సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు



అర్వపల్లిలో..



ఆత్మకూర్ (ఎస్) : నెమ్మికల్‌లో భిక్షాటన..

తిరుమలగిరి : తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయం ముందు ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ప్రభుత్వం పంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బక్కయ్య, నాగయ్య, శోభ, మహేష్, రాజు, యాకయ్య, నాగన్న, గౌరయ్య, ప్రసాద్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల బైక్ ర్యాలీ

పెన్‌పహాడ్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు ఆదివారం మండల కేంద్రంతో పాటు అనంతారం, నారాయణగూడెం, దోసపహాడ్, నాగులపహాడ్ గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ధనియాకుల శ్రీనివాస్ మాట్లాడారు. సమస్యలను పరిష్కరించకపోతే గత ప్రభుత్వాలకు పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకంటి నర్సయ్య, రణపంగ వెంకన్న, సతీష్, విజయ్, లింగయ్య, సైదులు, సత్యం, ఎల్ల మ్మ, వీరస్వామి, రమణయ్య, వెంకన్న, సైదమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

అర్వపల్లి : తమ ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం అర్వపల్లిలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జీడి కృష్ణ, కన్నెబోయిన శ్రీశైలం, గుగులోతు నాగులునాయక్, చెరుకు శంకర్, యాకూబ్, ప్రవీణ్, బాషమియా, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

నూతనకల్ : తమ సమ్మెలో భాగంగా ఆదివారం పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంటా నాగయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్ల సంఘం జిల్లా నాయకులు నకిరేకంటి శంభయ్య, బాబు, వెంకన్న, రామచంద్రారెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

చివ్వెంల : సమ్మెలో భాగంగా పంచాయతీ కార్మికులు ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అర్ధనగ్న నిరసన తెలిపారు. 10 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధకరమన్నారు. కార్యక్రమంలో సాగర్, క్రిష్ణ, రాంబాబు, ఈదయ్య, గోపాల్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల భిక్షాటన

ఆత్మకూర్ (ఎస్) : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు నెమ్మికల్ గ్రామంలో భిక్షాటన చేసి తమ నిరసనను తెలిపారు. ఈ కార్యక్రమంలో తన్నీరు వెంకన్న, అశోక్, సైదులు, యాదగిరి, నాగన్న, శ్రీను, భిక్షం తదితరులు పాల్గొన్నారు.



చివ్వెంలలో అర్ధనగ్న నిరసన..



నూతనకల్‌లో..



పెన్‌పహాడ్ : నారాయణగూడెంలో బైక్ ర్యాలీ..

దుండగులను వెంటనే అరెస్టు చేయాలి

నాగారం : నాగారం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కన్నెబోయిన వెంటభిక్షంపై హత్యాయత్నానికి పాల్పడిన దుండగులను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞానసుందర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని రహదారిబంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 21, 2023న భూవివాదంలో నాగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కన్నెబోయిన వెంటభిక్షంపై ఏనుగుల గోవర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, వరప్రసాద్, ఉపేందర్, రాజు, ఎల్లయ్యలు హత్యాయత్నానికి పాల్పడటంతో 307 సెక్షన్ కింద కేసు నమోదైందని తెలిపారు. ఈ ఘటన జరిగి నెల రోజులు గడుస్తున్నా నేరస్తులను పోలీసులు అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల ఒత్తిడితోనే పోలీసులు నిందితులను అరెస్టు చేయకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, నాయకులు కన్నెబోయిన వెంకటభిక్షం, జాజుల వీరయ్య, మంగదుడ్ల మల్లయ్య, దశరథ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి సాయం



అర్వపల్లి: నగదు అందజేస్తున్న సంతోష్ ముదిరాజ్



నూతనకల్ : ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబీకురాలు షేక్ లతీఫ్‌బి ఇటీవల మరణించారు. దీంతో మృతురాలి కుటుంబానికి ఆదివారం టీఎంపీఎస్ రాష్ట్ర చైర్మన్ ఈదునూరి సంతోష్ ముదిరాజ్ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జీడి సుందర్, కృష్ణ, యూసఫ్, నాగేంద్ర, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత..

లతీఫ్‌బి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వేములకొండ ఉప్పలయ్య బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లం వెంకన్న, సైదులు, రాజశేఖర్‌రెడ్డి, ఉజిత్ పాల్గొన్నారు.

నూతనకల్ : నూతనకల్ మండల పరిధిలోని తాళ్ల సింగారం గ్రామానికి చెందిన విడం లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకులు ఆదివారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్ చూడి లింగారెడ్డి 50కేజీల బియ్యం, బీఆర్ఎస్ రైతు విభాగం మండల అధ్యక్షుడు పన్నాల సైదిరెడ్డి రూ. 5వేల నగదు, గ్రామ శాఖ అధ్యక్షుడు తాడూరి సైదులు గౌడ్ 25కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వాడపల్లి వెంకన్న, పరాల గుర్వయ్య, వెంకటనారాయణ, జేపీ యాదవ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లు నిర్మిస్తాం



రోడ్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రజనిరాజశేఖర్

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు నిర్మాణాల పనులు చేపడతామని మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనిరాజశేఖర్ అన్నారు. ఆదివారం 5వ వార్డులో రోడ్లను పరిశీలించారు. త్వరలో జరిగే మున్సిపల్ సమావేశంలో బడ్జెట్ ప్రవేశపెట్టి నిధులు కేటాయిస్తామని తెలిపారు.

శాఖాహారంతో ఆరోగ్యం

కోదాడఅర్బన్: శాఖాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని శ్రీ మహాలక్ష్మి పిరమిడ్ ధ్యాన కేంద్రం అధ్యక్షుడు కాటేపల్లి నర్సింహారావు అన్నారు. ఆదివారం పట్టణంలో మాంసాహారం వద్దు.. శాఖాహారం ముద్దు అంటూ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో శాఖాహార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్‌బాబు, చంద్రకాంత్, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెంపటిలో వైభవంగా బోనాల పండుగ

తుంగతుర్తి : ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని వెంపటి గ్రామంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలను ముత్యాలమ్మ ఆలయం వద్దకు ర్యాలీగా తీసుకెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అబ్బగాని పద్మసత్యనారాయణ, ఎంపీటీసీ గుండగాని వీరసోములు, ఉపసర్పంచ్ వెంకన్న, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



వెంపటిలో బోనాలతో ర్యాలీగా వెళ్తున్న మహిళలు

అన్ని వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

కోదాడరూరల్ : అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ నాయకుడు మామిడి రామారావు, ఆర్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ అనంతు సైదయ్య అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని కొమరబండలో యాదవ కులస్తులకు రెండో విడతలో మంజూరైన గొర్రెలను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ నాగేంద్రబాబు, బత్తుల కిట్టు, బాలినేని రామ్మూర్తి, మల్లెబోయిన చంద్రయ్య, నాగరాజు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అయోమయంలో అన్నదాతలు

- వర్షాకాలం ప్రారంభమైనా కరుణించని వరుణుడు
- సాగునీటి ఎద్దడితో ఖరీఫ్ సాగుపై రైతుల ఆందోళన



భక్తాళాపురంలో సిద్ధంగా ఉన్న వరినారు

పెన్‌పహాడ్ : ఖరీఫ్ పంట సాగు ముందుకు సాగడం లేదు. వరుణ దేవుడు కరుణించకపోవడంతో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇంకా వేసవిని తలపించేలా వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. చదురు ముదురు వర్షాలు మినహా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవడం లేదు. పెద్ద వర్షాలు పడితేనే పంటల సాగుకు అనువుగా ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఈసారి నష్టమే...

ఏటా ఈ పాటికే సగానికి పైగా పంట సాగు పనులు పూర్తయ్యేవి. కానీ ఈ సారి ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. సమృద్ధిగా వర్షాలు కురకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ముందస్తుగా పత్తి పంట సాగుచేసుకున్న రైతులు వర్షాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. నారుమడులు ముదురుతుండడంతో ఏం చేయాలో తోచక ఆందోళన చెందుతున్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద మండలంలో సాగు ప్రారంభమే కాలేదు. గత ఏడాది ఈ పాటికే 2వేల ఎకరాల్లో పంట సాగు అయ్యింది. ఈసారి కనీసం వంద ఎకరాలు కూడా సాగు కాలేదు. బోరు బావుల కింద ఎకరం, అర ఎకరం పంట సాగు పనులు ఇప్పుడిప్పుడే ప్రారభమయ్యాయి. ఇప్పటివరకు సాగర్‌లో సరిసడా నీరు లేకపోవడంతో పంటల సాగుకు జలాలు అందడం కష్టమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇబ్బంది లేకుండా చూస్తాం

పంటల సాగు కాస్త ఆలస్యమైన విషయం వాస్తవమే. కానీ ఇంకా సమయం ఉంది. పీఏసీఎస్ కార్యాలయాల్లో రైతులకు అవసరమైన విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. సాగుకు సంబంధించి తమ శాఖ తరఫున సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

- టి.కృష్ణసందీప్, వ్యవసాయ అధికారి